క్లుప్తంగా

ఆకర్షణీయంగా శివయ్య విగ్రహం



బోట్‌క్లబ్‌: స్థానిక బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయ కోనేటిలో శివుని విగ్రహానికి పెయింటింగ్‌ పనులు పూర్తయ్యాయి. విగ్రహానికి చాలా కాలంగా రంగులు వేయించకపోవడంతో ఆధ్వానంగా తయారైంది. హరీష్‌ స్పోర్ట్స్‌ అధినేత తలాటం హరీష్‌ రూ.1.5 లక్షలు ఖర్చు చేసి అందంగా పెయింగ్‌ వేయించారు. పెయింట్‌ వేసేందుకు అంగీకరించిన ఆలయ అధికారులకు హరీష్‌ కృతజ్ఞతలు తెలిపారు.

స్వర్ణ పతక విజేతలకు సన్మానం



విద్యార్థినులను సత్కరిస్తున్న వర్మ తదితరులు

కాకినాడ కల్చరల్‌: అంతర్జాతీయ కర్ణాటక సంగీత, నాట్య కళాకారుల సంఘం (చైన్నై) ఆన్‌లైన్‌ ద్వారా ఇటీవల అంతర్జాతీయ స్థాయి కూచిపూడి నృత్య పోటీలు నిర్వహించారు. కాకినాడకు చెందిన నాట్యాచార్య డాక్టర్‌ కృష్ణకుమార్‌ శిష్యులు వివిధ విభాగాల్లో ఐదు స్వర్ణ పతకాలు సాధించారు. వారు ఐడియల్‌ ఇంజినీరింగ్‌ విద్యార్థులు కావడంతో సంస్థ అడ్మినిస్ట్రేషన్‌ ఆఫీసర్‌ వర్మ విజేతలైన సౌమ్యరేఖ, మనస్విని కృతి, గాయత్రి మెహల్‌, తేజస్విని, ఉమ, ఎస్‌.గాయత్రిలను కళాశాల ఆడిటోరియంలో ఆదివారం సన్మానించారు. నాట్యాచార్య డాక్టర్‌ కృష్ణకుమార్‌ను ఆయన అభినందించారు.

సునాద వినోదిని సావనీర్‌ ఆవిష్కరణ



సమావేశంలో ప్రసంగిస్తున్న ఐఏఎస్‌ అధికారి హెచ్‌ అరుణ్‌కుమార్‌

కాకినాడ కల్చరల్‌: స్థానిక యంగ్‌ మెన్స్‌ హ్యాపీ క్లబ్‌ దంటు కళాక్షేత్రంలో సునాద వినోదిని వాట్సప్‌ సంగీత అభిమానులు గ్రూపు సభ్యుల ఆత్మీయ సమ్మేళన సభ పంచాంగం విజయసారధి అధ్యక్షతన ఆదివారం జరిగింది. సభకు గ్రూపు సభ్యులను పరిచయం చేశారు. అనంతరం ఐఏఎస్‌ అధికారి హెచ్‌.అరుణ్‌కుమార్‌ సునాద వినోదిని సావనీర్‌ ఆవిష్కరించారు. మన సంస్కృతికి చిహ్నాలైన కళలను ఇలా ప్రోత్సహించడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం సంగీత కచేరి నిర్వహించారు. ఆకొండి వెంకటనారాయణమూర్తి, ఎం.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీమహాలక్ష్మికి మాజీ మేయర్‌ అభినందన



శ్రీమహాలక్ష్మిని సత్కరిస్తున్న మాజీ మేయర్‌ సుంకర శివప్రసన్న

కాకినాడ సిటీ: ఢిల్లీలో జరిగిన రిపబ్లిక్‌ డే పెరేడ్‌ క్యాంప్‌–2023లో పాల్గొని నగరానికి తిరిగి వచ్చిన సుంకర శ్రీమహాలక్ష్మిని వైఎస్సార్‌ సీపీ కాకినాడ నగర అధ్యక్షురాలు, నగర మాజీ మేయర్‌ సుంకర శివప్రసన్న అభినందించారు. ఆదివారం కాకినాడ దేవాలయం వీధిలోని శ్రీమహాలక్ష్మి నివాసానికి వెళ్లి సత్కరించారు. పెరేడ్‌లో పాల్గొనే అవకాశం దక్కడం కాకినాడ ప్రాంతానికి గర్వకారణమన్నారు. శ్రీమహాలక్ష్మి ప్రస్తుతం తిరుపతి పద్మావతి మహిళా లా కళాశాలలో చదువుతున్నారు. ఎన్‌ఎస్‌ఎస్‌ తరఫున ఢిల్లీ రిపబ్లిక్‌ డే పెరేడ్‌లో పాల్గొన్న ఆమెకు బెస్ట్‌ క్యాంపెయినర్‌ అవార్డు కూడా దక్కింది. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని శివప్రసన్న ఆకాంక్షించారు.

జనసేన అభినందన

బాలాజీచెరువు: అలాగే జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తలాటం సత్య శ్రీమహాలక్ష్మిని సత్కరించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి అవార్డు తీసుకోవడం అదృష్టమని అభినందించారు. ఈయన వెంట నాయకులు చీకట్ల వాసు, హైమ, మనోహర్‌ గుప్త ఉన్నారు.

12వ పీఆర్‌సీ అమలు చేయాలి

కాకినాడ సిటీ: ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లకు జులై ఒకటి 2023 నుంచి 12వ వేతన సవరణ అమలు చేయాలని ఎస్‌టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లంకలపల్లి సాయి శ్రీనివాస్‌, సీహెచ్‌ తిమ్మన్న డిమాండ్‌ చేశారు. ఆదివారం కాకినాడ ఎస్‌టీయూ భవన్‌లో జిల్లా శాఖ వార్షిక కౌన్సిల్‌ సమావేశంలో మాట్లాడారు. ఏడాది కాలంగా పెండింగ్‌లో ఉన్న వేతన సవరణ బకాయిలు, కరువు భత్యం భవిష్యనిధి జీవిత బీమా చెల్లింపు బకాయిలు సంపాదిత సెలవు నగదు, మెడికల్‌ చెల్లింపులు తక్షణం చేపట్టాలని డిమాండ్‌ చేశారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాటిపాక మధు, ఎస్‌టీయూ నాయకులు పాల్గొన్నారు.



కరపలో పూజలు చేస్తున్న ఎంపీ గీత, ఎమ్మెల్యే కన్నబాబు కుటుంబాలు



విరాళంగా ఇచ్చిన బంగారు, వెండి ఆభరణాలతో భక్తులు

మతాలకు అతీతంగా ఆలయాల అభివృద్ధి

- ఎమ్మెల్యే కురసాల, ఎంపీ గీత
- ఘనంగా ఉప్పాలమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ
- భక్త జనసంద్రమైన కరప

కరప: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మతాలకు అతీతంగా అన్ని దేవాలయాలను అభివృద్ధి చేస్తున్నట్టు ఎంపీ గీత, ఎమ్మెల్యే కన్నబాబు అన్నారు. నియోజకవర్గపరిధిలో వంద దేవాలయాలను అభివృద్ధి చేస్తున్నట్టు తెలిపారు. గ్రామంలో పునర్నిర్మించిన ఉప్పాలమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ ఆదివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఎంపీ, ఎమ్మెల్యేలు దంపతీ సమేతంగా హాజరై నిర్వహించారు. కరప, పరిసర మండలాల నుంచి అధికారులు, నాయకులు, భక్తులు తరలిరావడంతో గ్రామం జనసంద్రమైంది.

ఎంపీ వంగా గీత, ఆమె భర్త విశ్వనాథ్‌, ఎమ్మెల్యే కన్నబాబు, ఆయన భార్య శ్రీవిద్య, నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్‌ కురసాల సత్యనారాయణ, కృష్ణవేణి, సినీ దర్శకుడు కురసాల కళ్యాణకృష్ణ హోమం వద్ద పూజలు చేశారు. ప్రతిష్ఠాపన కార్యక్రమాలను మొసలపల్లి వాస్తవ్యుడు పి.సత్యనారాయణశాస్త్రి ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే కన్నబాబు స్థానిక నాయకులతో కలసి



ఉప్పాలమ్మతల్లి మూలవిరాట్‌ విగ్రహాన్ని, కలశాలను ఆలయంలోకి తీసుకెళుతున్న భక్తులు

ఆలయ నిర్మాణ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అమ్మవారి పుట్టింటివారు చోడపునీడి వంశీయులు అమ్మవారి విగ్రహం, గొల్లపల్లి వంశీయులు పోతురాజుబాబు గుడిని నిర్మించారు. ఈ సందర్భంగా ఆలయ శిల్పి శ్రీరాములును ఆలయ కమిటీ తరఫున ఎమ్మెల్యే కన్నబాబు ఘనంగా సత్కరించారు. ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, సత్తిబాబు, జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, చక్రవేణి, వైస్‌ ఎంపీపీ పాట్నీడి భీమేశ్వరరావు, సర్పంచ్‌ సాదే ఆశాజ్యోతి, కుమార్‌, శివాలయం కమిటీ మాజీ చైర్మన్‌ చొల్లంగి దుర్గారావు దంపతులు ఎమ్మెల్యే కన్నబాబు, అభివృద్ధికమిటీ చైర్మన్‌ కురసాల సత్యనారాయణ, ఎంపీ గీత దంపతులను, సినీ దర్శకుడు కళ్యాణకృష్ణలను ఘనంగా సత్కరించారు. సీఐ కె.శ్రీనివాస్‌ ఆధ్వర్యంలో ఎస్‌ఐ ఎస్‌.రామకృష్ణ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. 15 వేల మంది భక్తులు అమ్మవారిని ప్రసాదాన్ని స్వీకరించారు. డీసీసీబీ చైర్మన్‌ ఆకుల వీర్రాజు, సీతఊట ఆర్‌వీ నరసింహారావు, ఎమ్మెల్సీ చిక్కాల రామచంద్రరావు, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, సత్యనారాయణమూర్తి దంపతులు, జనసేన పీఏసీ సభ్యుడు పంతం నానాజీ, ఎంపీడీఓ కర్రె స్వప్న, తహసీల్దార్‌ పి.శ్రీనివాసరావు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, గ్రామ కార్యదర్శులు, వీఆర్వోలు, వివిధ పార్టీల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కురసాల కృషితో..

ఆలయం శిథిలావస్థకు చేరడంతో గ్రామస్తుల వినతి మేరకు ఎమ్మెల్యే కురసాల కన్నబాబు రూ.40 లక్షలు దేవదాయశాఖ నిధులు మంజూరు చేసి, గతేడాది ఫిబ్రవరి 3న భూమిపూజ చేశారు. నిధులకు తోడు దాతలు రూ.కోటి వరకు నగదు, బంగారు, వెండి ఆభరణాలు విరాళాలు ఇచ్చారు. ఆలయ కమిటీ, దేవదాయశాఖ పర్యవేక్షణలో సంపర శిల్పి డేగల శ్రీరాములు (సాయిబాబు) ఆకర్షణీయంగా ఆలయనిర్మాణం, అమ్మవారి విగ్రహాన్ని రూపొందించారు.

నమో భావనారాయణా..

- సర్పవరం క్షేత్రానికి పోటెత్తిన భక్తులు
- కుటుంబ సమేతంగా హాజరైన ఎమ్మెల్యే కురసాల

కాకినాడ రూరల్‌: నారద మహర్షి ప్రతిష్ఠించిన సర్పవరం క్షేత్రం భక్త జనసంద్రమైంది. ఏటా మాఘ ఆదివారం తిరునాళ్ళు జరుగుతాయి. శ్రీరాజ్యలక్ష్మి సమేత భావనారాయణ స్వామి కొలువైన ఈ క్షేత్రంలో మూడో ఆదివారం సుమారు 50వేల మంది భక్తులు వచ్చినట్టు దేవదాయ ధర్మదాయ శాఖ అసిస్టెంట్‌ కమిషనర్‌, ఆలయ ఈఓ విజయలక్ష్మి తెలియజేశారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ పాలక మండలి చైర్మన్‌ పుల్ల నారాయణరావు, పుల్ల చంద్రరావు చారిటబుల్‌ ట్రస్ట్‌ చైర్మన్‌ పుల్ల చందు, సర్పంచ్‌ శీలం చిన్న, ఉప సర్పంచ్‌ పుల్ల ప్రభాకరావు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పంచాయతీ సభ్యుడు పుల్ల చక్రధర్‌, సురేంద్ర తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఎమ్మెల్యే కురసాల కన్నబాబు కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు. పాతాళ భావనారాయణ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తల్లి దండ్రులు, సోదరుడు, కుటుంబ సభ్యులతో కలసి భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. ఈఓ, చైర్మన్‌లు వారికి తీర్థ ప్రసాదాలు అందించారు.

భక్తులకు మజ్జిగ పంపిణీ

ఆలయానికి వచ్చిన భక్తులకు గ్రామ వాకర్స్‌ సంఘం ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. క్లబ్‌ అధ్యక్షుడు పి.వెంకట్రావు, మాజీ గవర్నర్‌ బండి శ్రీనివాసరావు, కోశాధికారి గణపతి, డాక్టరు సత్తిబాబు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రామాలయ శిఖర, ధ్వజ స్తంభ ప్రతిష్ఠ

కొత్త గైగోలుపాడులో కోదండ రామాలయ శిఖర, ధ్వజ స్తంభ ప్రతిష్ఠ ఘనంగా జరిగింది. ఆలయ కమిటీ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు. ఆదివారం ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, కడియాల చిన్నా తదితరులు పాల్గొన్నారు.



ఆలయంలో స్వామివారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కన్నబాబు, సత్యనారాయణ, కల్యాణ్‌కృష్ణ



సర్పవరం ఆలయ ప్రాంగణంలో స్వామివారి దర్శనానికి క్యూలో వేచి ఉన్న భక్తులు



మజ్జిగ పంపిణీ చేస్తున్న వాకర్స్‌ సభ్యులు

ప్రకృతి వనరులు పరిరక్షించాలి



డాక్టర్‌ బాదం బాలకృష్ణ కుసుమ దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

బాలాజీచెరువు: ప్రకృతి వనరులను సంరక్షించి భావి తరాలకు కాలుష్య రహిత సమాజం అందిచాల్సిన బాధ్యత అందరిపై ఉందని లయన్స్‌ జిల్లా పూర్వపు గవర్నర్‌ డాక్టర్‌ బాదం బాలకృష్ణ పేర్కొన్నారు. రామారావు పేట లయన్స్‌ హాల్లో ఆదివారం సాయంత్రం లయన్స్‌క్లబ్‌ కాకినాడ ప్రెసిడెంట్‌ ఎస్‌.మురళీకృష్ణ అధ్యక్షతన జిల్లాలో వివిధ ప్రాంతాలలో ఉన్న 21 లయన్స్‌క్లబ్‌ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ క్లబ్‌ ద్వారా సామాజిక సేవలతో పాటు సమాజ ప్రయోజకర శాశ్వత ప్రాజెక్టులు స్థాపించి లయన్స్‌ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తున్నామని అన్నారు. అనంతరం డాక్టర్‌ బాదం బాలకృష్ణ, కుసుమ దంపతులను సత్కరించారు. లయన్‌ జిల్లా పూర్వపు గవర్నర్‌ విశ్వేశ్వరరావు, ప్రాజెక్టు చైర్మన్‌ దంగేటి సతీష్‌, చిట్నీడి శ్రీనివాస్‌, క్లబ్‌ సభ్యులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వేంకటేశ్వరునికి చక్రస్నానం

కరప: యండమూరులోని సామ్రాజ్యలక్ష్మి, గోదాదేవి సమేత వెంకటేశ్వరస్వామి వారి దివ్య కల్యాణ వేడుకల్లో భాగంగా ఆదివారం చక్రస్నానం నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను ఆలయ వంశపారంపర్య అర్చకుడు పెద్దింటి సీతారామం ప్రత్యేక పూజలు చేసి అనంతరం ఊరేగింపుగా తీసుకువెళ్లి చక్రస్నానం చేయించారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను శేషవాహనంపై ఉంచి మేళ తాళాలతో, బాణసంచా కాల్పులతో గ్రామోత్సవం జరిపారు. కూరపాటి రామకృష్ణమూర్తి ఇంటి వద్ద శేషవాహనాన్ని నిలిపి చోరసంవాదం నిర్వహించారు. అధికసంఖ్యలో తరలివచ్చి, స్వామిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. దేవదాయశాఖ ఈఓ పీవీఎస్‌ సూర్యనారాయణరాజు, కె.రఘు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

యండమూరులో స్వామివారికి చక్రస్నానం చేయిస్తున్న అర్చకుడు →



పోలీసు ఫలితాల్లో మార్కులు కలపాలి

కరప: పోలీస్‌ కానిస్టేబుల్‌ ఉద్యోగాలకు ప్రిలిమినరీ పరీక్షలు రాసిన అభ్యర్థులు నష్టపోకుండా కనీసం 5 మార్కులు కలపాలని రాష్ట్రీయ హిందూచైతన్య సదస్సు అధ్యక్షుడు, రాష్ట్ర యువమోర్చ మాజీనేత పడాల రఘు డిమాండ్‌ చేశారు. నడకుదురులో ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. పోలీసు ఉద్యోగాలకు 4,59,182 మంది రాతపరీక్ష రాయగా కేవలం 95,208 మందే అర్హత సాధించినట్టు ఫలితాల్లో వెల్లడయ్యాయన్నారు. 4,100 ఉద్యోగాలుంటే ఒక్కో ఉద్యోగానికి 15 మంది (1:15) పోటీపడతారన్నారు. ప్రిలిమినరీ పరీక్షల ప్రశ్నా పత్రాలుకు సంబంధించిన జవాబు పత్రాలలో తప్పులున్నట్టు అనేకమంది గుర్తించారని ఆయన తెలిపారు. తప్పులు సవరించకుండా ఫలితాలు విడుదల చేయడం శోచనీయమన్నారు. జరిగిన నష్టం కొంతవరకైనా తీర్చాలంటే కనీసం 2 నుంచి 5 మార్కులు కలపాలని రఘు కోరారు. ఈమేరకు ముఖ్యమంత్రికి లేఖ రాసినట్టు ఆయన చెప్పారు.

శెట్టిబలిజలకు అన్నింటా ప్రాతినిధ్యం కల్పించాలి

- కమ్యూనిటీ హాల్‌ నిర్మాణానికి స్థలం కేటాయించాలి
- శెట్టిబలిజ జనజాగృతి ఆర్గనైజేషన్‌ డిమాండ్‌

కాకినాడ సిటీ: నగరంలో 35 వేల మంది ఓటర్లు ఉన్న శెట్టిబలిజ వర్గానికి ఒక ఎకరా స్థలంలో కమ్యూనిటీ హాలు నిర్మించాలని శెట్టిబలిజ జన జాగృతి ఆర్గనైజేషన్‌ డిమాండ్‌ చేసింది. ఆదివారం ఓ ప్రైవేట్‌ హోటల్‌లో నిర్వహించిన సమావేశంలో పలువురు నాయకులు పాల్గొని మాట్లాడారు. ఈ విషయమై ప్రభుత్వానికి, ఎమ్మెల్యేలకు, ఎంపీ, కలెక్టర్లకు వినతి పత్రాలు ఇవ్వాలని నిర్ణయించింది. అలాగే కాకినాడ టౌన్‌లో బార్లు, వైన్‌ షాపులు ఏర్పాటు చేయడంలో ఈ సంఘీయులకు 40 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. ప్రభుత్వం వీటిని నిర్వహిస్తున్నట్లయితే ఉద్యోగాల్లో 50 శాతం శెట్టిబలిజ కులస్తులకు అవకాశం కల్పించాలని కోరారు. టౌన్‌లో ఉన్న గడి, బడి సత్రాలు తదితర వాటిల్లో నామినేట్‌ పదవుల్లో 20 శాతం రిజర్వేషన్లు ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో ఎమ్మెల్సీ పదవుల్లో తగిన ప్రాధాన్యం కల్పించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డిని కోరుతు ప్రత్యేక లెటర్లు పంపించేందుకు సమావేశం నిర్ణయించింది. శెట్టిబలిజ కార్పొరేషన్‌కు నిధులు కేటాయించి, కాకినాడ జిల్లాలో ఉన్న మహిళలు, యువత ఎదుగుదలకు వ్యాపారాలు పరిశ్రమలు స్థాపించుకునేందుకు వీలుగా సబ్సిడీ రుణాలు అందివ్వాలని కోరారు. వృత్తి రీత్యా కల్లుగీత కార్మికులకు 45 ఏళ్ల దాటిన వారికి పెన్షన్‌ సదుపాయం కల్పించాలన్నారు. శెట్టిగాళ్లు అని పిలవకుండా ఉండే విధంగా నాయీ బ్రాహ్మణులకు ఇచ్చిన విధంగా జీవో ఇవ్వాలని సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 56 శాతం ఉన్న బీసీలకు దామాషా ప్రకారం సీట్లు కేటాయించాలన్నారు. బీసీ కులగణన చేయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని శెట్టిబలిజ జన జాగృతి ఆర్గనైజేషన్‌ డిమాండ్‌ చేసింది. ఈ సమావేశంలో గుత్తుల రమణ, పితాని నూకరాజు, మేడిశెట్టి తిరుపతిరావు, చెల్లుబోయిన కొండలరావు, వాసంశెట్టి రమణ, రాయుడు నాగేశ్వరరావు, దంగేటి సత్యనారాయణ, గుత్తుల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



శెట్టిబలిజ జనజాగృతి ఆర్గనైజేషన్‌ సమావేశంలో పాల్గొన్న నాయకులు

వైభవంగా పార్వతీ పరమేశ్వరుల సంబరం

- అగ్నిగుండం తొక్కిన భక్తులు
- ప్రత్యేక పూజలు చేసిన అర్చకులు

కరప: మండలం గొర్రిపూడిలోని బసవేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం కరికాలభక్తులు పార్వతీ, పరమేశ్వరుల సంబరాన్ని ఘనంగా నిర్వహించారు. గొర్రిపూడి పరిసర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. మాఘపౌర్ణమి సందర్భంగా బసవేశ్వరస్వామిని అర్చకులు బాదంపూడి వీర వెంకట సత్యనారాయణశర్మ, శివకుమార్‌శర్మలు ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. యేట భీష్మ ఏకాదశి రోజున బసవేశ్వరస్వామి ఆలయంలో కళ్యాణ వేడుకలు నిర్వహించి, ఐదు రోజుల పాటు వివిధ రీతులలో నిర్వహించే ఉత్సవాల్లో భక్తులు మొక్కులు తీర్చుకుంటారు. ఆదివారం రాత్రి భక్తులు స్వామివారిని దర్శించుకున్న తర్వాత ఆలయం వద్ద ఏర్పాటు చేసిన అగ్ని గుండాన్ని తొక్కారు. సంతానంలేని వివాహితలు పుణ్యస్నానమాచరించి, స్వామిని దర్శించుకుని, నందిని తలపై ధరించి, నిప్పుల గుండం తొక్కారు. ఇలాచేస్తే సంతానం కలుగుతుందని, కోరిన కోర్కెలు నెరవేరతాయని గ్రామస్తుల విశ్వాసం. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించి, భక్తులకు ప్రసాద వితరణ చేశారు.



ఆలయం వద్ద అగ్నిగుండం తొక్కుతున్న భక్తులు

యువకుడికి గాయాలు

కాకినాడ క్రైం: ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో ఓ యువకుడు తన కాలి వేలును కోల్పోయాడు. కాకినాడ సూర్యారావుపేట మాదిరెడ్డి వారి వీధికి చెందిన ఇమ్మంది పవన్‌సాయి (24) ఆదివారం తన తల్లికి అనారోగ్యం కావడంతో మందులు కొనేందుకు బైక్‌పై బాలాజీ చెరువు కూడలికి బయల్దేరాడు. సాలిపేట గర్ల్స్‌ హైస్కూల్‌ను సమీపించే సరికి ఎదురుగా వస్తున్న మరో బైక్‌ పవన్‌ సాయిని ఢీకొంది. ఈ ఘటనలో సాయి ఎడమకాలి బొటన వేలు తెగిపడింది. తక్షణమే అతడిని కాకినాడ జీజీహెచ్‌లో చేర్చారు. ఈ ఘటనపై కాకినాడ త్రీ టౌన్‌ పోలీసులు కేసు నమోదు చేశారు.

తప్పిన ప్రమాదం

కాకినాడ రూరల్‌: కాకినాడ–పిఠాపురంలో మార్గంలో రమణయ్యపేట ఏపీఎస్పీ వద్ద ప్రయాణికులతో వెళుతున్న వాహనానికి ఆదివారం పెద్ద ప్రమాదం తప్పింది. కాకినాడ వైపు వస్తున్న వాహనం అదుపు తప్పి ఏపీఎస్పీ పక్కన కల్వర్టులోకి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో ఎవరికి ఏ విధమైన గాయాలు అవ్వలేదు. దీంతో వాహన డ్రైవర్‌, అందులో ఉన్న వారు ఊపిరిపీల్చుకున్నారు. అదుపు తప్పి పక్కకు దూసుకు పోయిన వాహనం వద్దకు పెద్ద ఎత్తున స్థానికులు, ఈ మార్గంలో ప్రయాణించేవారు చేరుకుని, లోపలి ఉన్న వారు క్షేమం ఉన్నట్టు తెలుసుకుని కుదుటపడ్డారు.

10న రక్తదానం శిబిరం

కాకినాడ సిటీ: ది కాకినాడ కో ఆపరేటివ్‌ బిల్డింగ్‌ సొసైటీ ఆధ్వర్యంలో పదో తేదీన సంఘం ప్రధాన కార్యాలయంలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్టు సొసైటీ అధ్యక్షుడు కోసూరి శ్రీనివాస సత్యనారాయణమూర్తి ఆదివారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని రోటరీ క్లబ్‌ సౌజన్యంతో నిర్వహిస్తున్నామని, సంఘ సభ్యులు, యువకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పిడుగులమ్మ తల్లి ఆలయ పునః ప్రతిష్ఠ

బోట్‌క్లబ్‌: స్థానిక డైరీఫారం సెంటర్‌ సంజీవ్‌నగర్‌లో ఉన్న గ్రామ దేవత పిడుగులమ్మ తల్లి పునఃప్రతిష్ఠ ఆదివారం వైభవంగా నిర్వహించారు. కొడా చైర్‌పర్సన్‌ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్‌ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న ఈ కార్యక్రమానికి హాజరై ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి, భక్తుల సహకారంతో ఆలయాన్ని రూ.30 లక్షలతో నిర్మించారు. 70 ఏళ్ల చరిత్ర కల్గిన అమ్మవారి నూతన ఆలయం, విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించడం తమ అదృష్టంగా భావిస్తున్నట్టు ఆలయ కమిటీ అధ్యక్షులు జీరి కరుణాకరరెడ్డి, సెక్రటరీ కోనాడి దుర్గాప్రసాద్‌ తెలిపారు. మాజీ కార్పొరేటర్‌ నల్లబిల్లి సుజాత, ఆలయ కమిటీ సభ్యులు సంతోష్‌, అప్పలనాయుడు, త్రిమూర్తులు, తోటయ్య రామస్వామి, రాంబాబు, బుజ్జి వెంకటరమణ పాల్గొన్నారు.



పిడుగులమ్మ తల్లి పునఃప్రతిష్ఠలో పాల్గొన్న కొడా చైర్‌ పర్సన్‌ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి

ఉత్సాహంగా ‘చదవడం మాకిష్టం’



విద్యార్థులకు బోధిస్తున్న గ్రంథాలయాధికారి శ్రీనివాసరావు

బాలాజీచెరువు: జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నగరంలో ఉన్న గ్రంథాలయాల శాఖల్లో ఆదివారం నిర్వహిస్తున్న చదవడం మాకిష్టం కార్యక్రమానికి విశేష ఆదరణ కలుగుతోంది. సెలవు రోజుల్లో చదువుకు విరామం కలగకుండా విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరై చందమామ కథలు, అల్లాడిన్‌, ది ప్లాంట్‌ కింగ్డమ్‌ తదితర పుస్తకాలు అభ్యసిస్తున్నారు. గాంధీనగర్‌ శాఖ కార్యాలయంలో దాదాపు 200 మంది విద్యార్థులు పైగా సందర్శించగా గ్రంథాలయాధికారి ములంపాక శ్రీనివాసరావు విద్యార్థుల సందేహాలను నివృత్తి చేసి, వారికి కావలసిన పుస్తకాలు అందజేశారు.

కృతజ్ఞ సంస్థ రక్తదానం

కాకినాడ క్రైం: కృతజ్ఞ స్వచ్ఛంద సేవా సంస్థ మూడో వార్షికోత్సవం సందర్భంగా 40 మంది యువకులు రక్తదానం చేశారు. ఆదివారం కాకినాడలో జరిగిన ఈ కార్యక్రమానికి శ్రీ యువసేన స్వచ్ఛంద సేవా సంస్థ వేదికైంది. వార్షికోత్సవం సందర్భంగా రేపూరుకు చెందిన నిరుపేద కుటుంబానికి కిడ్నీ శస్త్రచికిత్స కోసం రూ.20 వేలు చెక్‌ను కృతజ్ఞ ప్రతినిధులు అందజేశారని సంస్థ వ్యవస్థాపకుడు బొల్లం సతీష్‌ తెలిపారు. ఆదివారం 500 మందికి జీజీహెచ్‌లో అన్నదానం నిర్వహించినట్టు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో కృతజ్ఞ సంస్థ అధ్యక్షుడు ఆతవ రమేష్‌తో పాటు సభ్యులు పాల్గొన్నారు.



శ్రీ యువసేన స్వచ్ఛంద సంస్థలో రక్తదానం చేస్తున్న యువకులు

దేశ సంస్కృతిని చాటిచెప్పిన విశ్వనాథ్‌

సామర్లకోట: దేశ సంస్కృతి, సంప్రదాయాలను తన సినిమాల ద్వారా ప్రపంచానికి చాటి చెప్పిన మహా వ్యక్తి కె.విశ్వనాథ్‌ అని ట్రాఫిక్‌ ఎస్సై అడపా గరగారావు అన్నారు. స్థానిక స్టేషన్‌ సెంటర్‌లో పట్టణ కళాకారుల ఆధ్వర్యంలో విశ్వనాథ్‌ సంతాప కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని సినిమాల ద్వారా ఆయన చేసిన సేవలను కొనియాడారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత తోటకూర సాయిరామకృష్ణ, జర్నలిస్టు అడపా వెంకట్రావు, మదర్‌థెరిస్సా వలంటరీ ఆర్గనైజేషన్‌ అధినేత జి.రాజు, నియోజకవర్గ కళాకారుల సంఘ ప్రతినిధులు బడుగు సీతారామరాజు, గిడుతూరి శ్రీనివాసరావు సంతాపం తెలిపారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్సై గరగారావు

జిల్లా వీఆర్వోల సంఘ కార్యదర్శిగా చంటిబాబు

తుని రూరల్‌: కాకినాడ జిల్లా గ్రామ రెవెన్యూ అధికారుల (వీఆర్వో) సంఘం కార్యదర్శిగా తుని మండలం ఎస్‌.అన్నవరం వీఆర్వో కొట్టేటి చంటిబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాకినాడలో ఆదివారం సంఘ నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. సంఘ సభ్యులు తనను జిల్లా కార్యదర్శిగా తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు చంటిబాబు తెలిపారు. జిల్లా కార్యదర్శిగా ఎన్నికైన చంటిబాబుకు తుని, తొండంగి, కోటనందూరు మండలాల వీఆర్వోలు శుభాకాంక్షలు తెలిపారు.